క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌ను కలిసిన ఉద్యోగులు



జనగామ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్ డాక్టర్. కె.నాగమణిని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు బొకే ఇచ్చి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పరమేష్, ఉపాధ్యక్షుడు నవీన్, కార్యదర్శి ప్రవీణ్, భాస్కర్, రాజు, శ్రీకాంత్, వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలు చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న నర్సింగరావు

జనగామ రూరల్: బీసీలు చైతన్యవంతులై హక్కులను కాపాడుకోవాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపకుడు కటకం నర్సింగరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమితి రాష్ట్ర కార్యదర్శి పన్నీరు సత్యనారాయణ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుజిగంటి చంద్రశేఖర్, ఆవుల వెంకట్ యాదవ్, చుంచు శ్రీనివాస్, బ్రహ్మం, రామ్మూర్తి, ప్రకాశ్, డాక్టర్ మాచర్ల భిక్షపతి, జి.కృష్ణ, మంగళంపల్లి రాజు, ఆలేటి లింగం, బాల నారాయణ పాల్గొన్నారు.

చేయూత



బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కుందారపు శ్రీకాంత్ ఇటీవల మృతి చెందాడు. కాగా, శ్రీకాంత్‌తో 2000–01లో పదో తరగతి కలిసి చదువుకున్న తోటి స్నేహితులు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.55వేల సాయం అందజేశారు. పూర్వ విద్యార్థులు రాజు, చంద్రమౌళి, నర్సింహారెడ్డి, బాలకృష్ణ, బాలు, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో చెరువులు నింపాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమయ్య

జఫర్‌గఢ్: గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పెద్ద చెరువును నాయకులు, రైతులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా వర్షాలు లేక చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయన్నారు. సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, కాట సుధాకర్, నల్లతీగల శ్రీను, ఎండీ శంషొద్దిన్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులు పూర్తిచేయాలి

పాలకుర్తి టౌన్: పాలకుర్తి రిజర్వాయర్ అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేసి దేవాదుల నీటితో చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పాలకుర్తి రిజర్వాయర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు.

'కడకంచి'కి ప్రతిభా పురస్కారం



అవార్డును అందుకుంటున్న పాపయ్య

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్లకు చెందిన కవి, కళారత్న కడకంచి పాపయ్యకు 2023 ప్రతిభా పురస్కార అవార్డును శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీ ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ఇచ్చే అవార్డుల్లో భాగంగా కవి, కళారత్న, మహిళా బోనాల సృష్టికర్త కడకంచి పాపయ్యకు నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జానపద కళాకారులు పాపయ్యను అభినందించారు.

నిరుపయోగంగా ఆర్‌ఓ ప్లాంట్

- తాగునీటికి ఇబ్బందిపడుతున్న విద్యార్థులు



వృథాగా మారిన ఆర్‌ఓ ప్లాంటు

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో ఆర్‌ఓ ప్లాంటు మరమ్మతుకు నోచుకోక విద్యార్థులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటు ఏడాదికిపైగా మరమ్మతుకు నోచుకోక నిరుపయోగంగా మారింది. మోడల్‌స్కూల్‌లో దాదాపు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో దాహం వేసినప్పుడు తాగునీటికి అల్లాడుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయులు కొంత మేర వాటర్ క్యాన్లు తెప్పించినా అవి అంతంత మాత్రమే అందుతున్నాయి. తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతు చేయించి విద్యార్థులకు తాగు నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైద్యశాస్త్ర పితామహుడు సుశ్రుత



మాట్లాడుతున్న డాక్టర్ అంజిరెడ్డి

జనగామ: వైద్య శాస్త్రంలో ప్రావీణ్యత సాధించడమే కాకుండా, శస్త్ర చికిత్సలో ఆయుర్వేద పితామహుడు సుశ్రుత కృషి చరిత్ర ఉన్నన్ని రోజులు గుర్తుండిపోతుందని వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్ డాక్టర్ అంజిరెడ్డి అన్నారు. మంగళవారం సుశ్రుత జయంతి పురస్కరించుకుని హాస్పిటల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి ప్లాస్టిక్ సర్జరీ పరిచయం చేసిన తొలి శస్త్ర చికిత్స ఆయుర్వేద పితామహుడు సుశ్రుతుడన్నారు. వైద్య ప్రపంచం నేడు సుశ్రుతుడిని ప్లాస్టిక్ సర్జరీ రూప శిల్పిగా పిలుస్తారన్నారు. వేల సంవత్సరాల క్రితమే ఆయన 120 రకాల వైద్య పరికరాలను ఉపయోగించారన్నారు. మానవునికి శస్త్రచికిత్స చేసిన తర్వాత, నొప్పిని తగ్గించేందుకు ఆల్కహాల్(పేయిన్ కిల్లర్)ను గుర్తించిన మొట్ట మొదటి వ్యక్తి ఆయనే అన్నారు.

'స్థానికం'లో గులాబీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న రాజయ్య

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గత 18 నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి, నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదన్నారు. సమావేశంలో గబ్బెట బుచ్చయ్య, జైపాల్‌రెడ్డి, కడారి శంకర్, పెంతల రాజ్‌కుమార్, ఎండీ నజీర్, కోత్వాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పూర్తి స్థాయి సహకారం అందించాలని క్లస్టర్ మండల ఇన్‌చార్జ్‌లు గజ్జెల నర్సిరెడ్డి, వాంకుడోత్ అనిత కోరారు. గంగాపూర్ గ్రామంలో క్లస్టర్ ముఖ్య కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

జనగామ రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో మంగళవారం సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధ్యక్షతన రెండు రోజు జరిగిన పార్టీ సభ్యుల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో పేరుకుపోయిన సమస్యలను స్పెషల్ ఆఫీసర్ పింకేష్ కుమార్ పరిష్కరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, బోట్ల శేఖర్, భూక్య చందు నాయక్, ఎండీ అజారుద్దీన్, పుతుకనూరి ఉపేందర్, బాల్నే వెంకట మల్లయ్య, కల్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో అన్నదాతలు

బచ్చన్నపేట: వర్షాలు సకాలంలో కురవక పంటలను సాగు చేసిన అన్నదాతలు అయోమయంలో పడిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఎండిపోయిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మండల కార్యదర్శి వెంకటేష్, నాయకులు, రైతులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

జనగామ రూరల్: సమాజంలో వెనుకబడిన ఎరుకల కులస్తులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మాన్యులు వలిగి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ఆధ్వర్యంలో 'కేరుంగో కుర్రు నడుంగో' కరతపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆగస్టు 3వ తేదీన సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. కూతాటి నరసింహ, కూరాకుల రవి, యాదగిరి, సుభాష్, రాఘవ, శ్రీను, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్/కొడకండ్ల: నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చడమే ధ్యేయంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం పాలకుర్తి, కొడకండ్లలోని క్యాంపు కార్యాలయాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులు .. పక్కా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందించే సాయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అయా కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నాయకులు గిరగాని కుమారస్వామి, బండిపెల్లి మణెమ్మ, ధరావత్ సురేష్‌నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి టౌన్: ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

విద్యుత్ లోఓల్టేజీ సమస్య లేకుండా చూడాలి

గ్రామీణ ప్రాంతాల్లో తరుచూ ఏర్పడుతున్న లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఈ రాంబాబు, ఏడీఏ శ్రీనివాస్, ఏఈలు రణధీర్,రాకేష్, రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు, పక్కన కోచ్ రవి

జనగామ: తమిళనాడు రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న సౌత్ జోన్ జాతీయ స్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు జోషితా సునైనా, అర్చన, వైష్ణవి, అక్షయ, శ్రుతకీర్తి, దిలీప్ అర్హత సాధించారు. జిల్లా నెట్‌బాల్ అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోచ్ రవి కుమార్ విద్యార్థులను అభినందించారు. కాగా మంగళవారం విద్యార్థులు సికింద్రాబాద్ రేల్వేస్టేషన్ నుంచి తమిళనాడుకు బయలుదేరారు.

నాణ్యమైన సేవలు అందించాలి



న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు

- డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్ రావు

బచ్చన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి గదులను, పరీక్షలు నిర్వహించే యంత్రాలు, ఆస్పత్రి ఆవరణను పరిశీలించారు. టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందుతన్న పలు రకాల సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. అందుకు గాను గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. 23 మంది టీబీ పేషెంట్లకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి సృజన, డాక్టర్లు ప్రసన్న కృష్ణ, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పాలకుర్తి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ సిద్దారెడ్డి అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గూడూరు గ్రామంలో డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం సికార్యక్రమంలో ఏఎన్‌ఎం చంద్రకళ, శోభారాణి, ఆశ వర్కర్లు సిహెచ్ ఉపేంద్ర, అన్నపూర్ణ, రేణుక, రమ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పురోగతికి ఉద్యమాలు

పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి

దేవరుప్పుల: ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల సాధన కోసం కార్యాచరణ ఉద్యమాలు చేపడుదామని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని హైస్కూల్‌లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పీఆర్‌టియూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబటి అంజయ్య, గోలి తిరుపతిరెడ్డి, రాష్ట్ర, జిల్లా కౌన్సిల్ సభ్యులు దోసపాటి శ్రీనివాస్, పసునూరి సోమరాజు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి

హైదరాబాద్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



జనగామ: జనగామ నుంచి హైదరాబాద్‌కు తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జనగామ/రఘునాథపల్లి/దేవరుప్పుల/బచ్చన్నపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మంగళవారం జరిగిన ధర్నాకు బీఆర్‌ఎస్ నాయకులు పలు జనగామ పట్టణంతోపాటు మండలాల నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను ఆర్డినెన్స్ పేరిట మోసం చేసే కుట్రలు తగవని అన్నారు. తరలివెళ్లిన వారిలో నాయకులు బాల్దె సిద్ధిలింగం, జుకంటి శ్రీశైలం, నీల యాదగిరి, మామిడాల రాజు, ఉల్లెంగుల సందీప్, జాయ శ్రీశైలం, దండు ఉపేందర్, బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్, దయాకర్, మేకల సంపత్, మూసిని రాజుగౌడ్, కోనేటి స్వామి, బావండ్ల కృష్ణంరాజు తదితరులు ఉన్నారు.

తూము సమస్యకు పరిష్కారం

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన ఇరిగేషన్ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండ గ్రామంలోని పెద్ద చెరువు తూము సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. పెద్ద చెరువు తూము సమస్యపై గ్రామానికి చెందిన విద్యావంతుడు, యువరైతు అట్ల రాజు గ్రామానికి చెందిన ఇతర రైతులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదుతో మంగళవారం ఇరిగేషన్ అధికారులు స్పందించారు. నమిలిగొండ గ్రామ పెద్ద చెరువు కింద దాదాపు 1,500 ఎకరాల వ్యవసాయ భూమి ఉంటుంది. అయితే కొన్ని సంవత్సరాలుగా పెద్ద చెరువు తూము పూర్తిగా కూరుకుపోవడంతో పంటపొలాలకు సాగునీరు అందడం లేదు. దాంతో ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఈ విషయమై యువరైతు పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో మే నెల 5న, జూలై 8న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ అధికారులు స్పందించకపోవడంతో ఈ నెల 14వ తేదీన మరోసారి గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సమస్యను వివరించారు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఇరిగేషన్ ఈఈ వినయ్‌బాబు, డీఈ సంపత్‌కుమార్, ఏఈ యాసర్ నమిలిగొండ పెద్ద చెరువుతూమును పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకుని సాయంత్రం తూము మరమ్మతు పనులను చేపట్టగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పురమాని ఐలోని, ఓరుగంటి రమేష్, సముద్రాల శేఖర్, పులి వంశీ, కోల రాజయ్య, సెండెల రమేష్, అరిసెల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఈఈ వినయ్‌బాబు

'ఆరోపణలు అవాస్తవం'



వివరాలు తెలుపుతున్న బాధిత రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో సర్వే నంబర్ 46లోని ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేశామంటూ తమపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని శివునిపల్లికి చెందిన రైతులు బూర్ల జయరాములు, బూర్ల చిన్నయాదగిరి తెలిపారు. శివునిపల్లిలోని తమ పట్టాభూమి వద్ద మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. సర్వే నంబర్ 45లో తమ పట్టా భూమి ఉందని, తాతల కాలం నుంచి సదరు భూమిలో సాగుచేస్తున్నామన్నారు. తమ వ్యవసాయ భూములకు దారి లేకుండా కొందరు ఉద్దేశ్యపూర్వకంగా వ్యక్తిగత కక్ష్యలతో చేసిన ఫిర్యాదు మేరకు తమ భూమిలో ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారని వాపోయారు. రెవెన్యూ అధికారులు తమకు ముందస్తు ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారని, ఈ విషయమై తమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయంపై ఇటీవల గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు స్పందించి రీ సర్వే చేపట్టాలని, సర్వే నంబర్లు 36, 37, 45ల లో సమగ్ర సర్వే చేసి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో తమకు ఆత్మహత్యయే శరణ్యమని వాపోయారు. బాధితులు బూర్ల రాజు, ఎల్లమ్మ, తిరుపతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

జనగామ రూరల్: ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మేరా యువ భారత్–వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. నెహ్రూ యువ కేంద్రం చింతల అన్వేష్, మండ రాజేష్, హెచ్‌ఎం పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇళ్ల పట్టాలు అందజేత

తరిగొప్పుల: మండలంలోని పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందించినట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోటా కింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించారు.

రక్షణ కల్పించాలని సీపీకి వినతి

హసన్‌పర్తి : మాజీ మావోయిస్ట్, జనగామ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, రౌడీషీటర్ శివకుమార్ నుంచి తనకు రక్షణ కల్పించాలని రఘునాథ్‌పల్లికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ జ్ఞానేష్‌సింగ్ కోరాడు. మంగళవారం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి వేడుకున్నాడు. జనగాం జిల్లాలో కాంగ్రెస్ నాయకుడిగా కొనసాగుతున్న పోకల శివకుమార్ రౌడీషీటర్ చేస్తున్న భూ మాఫియాతో పాటు ఇతర అరాచకాలను తాను బహిర్గతం చేయడంతో గతంలో తనపై దాడి చేశాడని పేర్కొన్నాడు. మళ్లీ ఇప్పుడు తనపై ప్రతీకారం తీర్చుకోవడానికి శివకుమార్.. రాంబాబు సహకారంతో తనను చంపడానికి పథకం వేస్తున్నాడని ఆ ఫిర్యాదులో ఆరోపించాడు. తనకు ఏదైనా జరిగితే అందుకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగాం గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, రౌడీషీటర్ శివకుమార్‌లతో పాటు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్న రియాజ్‌లు బాధ్యులని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

తరిగొప్పుల: రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాను మరో మారు చాటాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అన్నారు. మంగళవారం మండలంలోని బొంతగట్టు నాగారం, బొత్తలపర్రె, బొజ్జతండా, జాల్యాయ్‌తండా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.

డిప్యుటేషన్లను రద్దు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇతర ఆశ్రమ పాఠశాలలకు, హనుమకొండలో కోచింగ్‌సెంటర్ల పేరుతో వెళ్లిన ఉపాధ్యాయుల డిప్యుటేషన్లను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యాకన్న రాథోడ్ డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నాయకులు ఆర్య, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని ఆలింపూర్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం స్వర్ణతార కోరారు. మంగళవారం పాఠ

సంక్షిప్త సమాచారం

శాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాసారం కృష్ణ టై, బెల్టులు, గుర్తింపు కార్డులను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు.

శాకంబరీ దేవిగా రేణుకా ఎల్లమ్మ తల్లి

జనగామ రూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న రేణుకా ఎల్లమ్మ తల్లి మంగళవారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. కాలనీలోని మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి కలశాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. పూజారి శ్యాంప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

జనగామ రూరల్: దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జిల్లాలు లిఫ్టింగ్ చేసి జిల్లాలోని 9 రిజర్వాయర్లు, 723 చెరువులు, కుంటలు నింపాలని జిల్లా వ్యాప్తంగా ఈనెల 18,19వ తేదీన తహసీల్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందునాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ వద్ద ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అజ్మీరా సురేష్ నాయక్, మంగ బీరయ్య, గోడ రాములు, కర్ల నర్సిరెడ్డి, నరసయ్య, కిష్టయ్య, రమేష్, సందుపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్టకు చెందిన ఓర్సు రాజు (35) మూడు రోజుల క్రితం క్రిమిసంహారక మందుతాగి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చిల్పూరుగుట్టకు చెందిన రాజుకు భార్య అరుణతో కొద్దిరోజులుగా గొడవ జరుగుతోంది. దీంతో మనస్తాపానికి గురైన రాజు గ్రామంలోని సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో క్రిమిసంహారక మందుతాగి ఫోన్ ద్వారా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

ఎన్నిక



నర్మెట: జిల్లా ఫొటోగ్రాఫర్స్ సంఘం ప్రధాన కార్యదర్శిగా వెల్దండకు చెందిన కొంపెల్లి భాస్కర్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా మండల ఫొటోగ్రాఫర్లు మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో ఆయనను శాలువాతో సన్మానించారు. తన గెలుపునకు సహకరించిన సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బచ్చన్నపేట: మండలంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సదాశివపేట వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని అన్నారు. మిన్నాలపురం విజయకాంత్, గజ్జెల శేఖర్, కర్రె సాగర్‌ల ట్రాక్టర్‌లను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

దేవరుప్పుల: వ్యవసాయ పొలాల్లో మేత మేస్తూ ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మాధాపురం రెవెన్యూ పరిధి పడమటితండాలో చోటుచేసుకుంది. వ్యవసాయ సీజన్‌లో కాడెద్దు మృతితో రూ.50 వేల నష్టంతోపాటు సాగు చేసేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ఎ.కాండియా కోరారు.

నిత్యావసరాల అందజేత

పాలకుర్తి: మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన పాము సునీత అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, మంగళవారం బాధిత కుటుంబాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ పరామర్శించి బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కావాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. ఇప్పగూడెం గ్రామంలో పార్టీ గ్రామ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడారు.